క్లుప్తంగా

28న వందే భారత్ అవార్డుల ప్రదానం

కాచిగూడ: శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 28న బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ భవన్‌లో 'వందే భారత్ అవార్డ్స్' ప్రదానోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి కృష్ణ తెలిపారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వైద్యులు, ఇంజినీర్స్, లాయర్స్, కరోనా వారియర్స్, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, సాంస్కృతిక ప్రతినిధులు, రాజకీయ నేతలకు అభినందన సత్కారం ఉంటుందని ప్రకటించారు. ఆయా రంగాల్లో సేవలందించిన వారు ఈ నెల 21 లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494523562 నంబరును సంప్రదించాలని కోరారు.

శబరియాత్ర విజయవంతం

కాచిగూడ: జవంతీశ్వర అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు చేపట్టిన శబరిమల జ్యోతియాత్ర పూర్తి స్థాయిలో విజయవంతమైందని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి విష్ణు గురుస్వామి తెలిపారు. జవంతీశ్వర అయ్యప్ప సేవా సంఘం చైర్మన్ రంగారావు గురుస్వామి, అధ్యక్షుడు బోసు గురుస్వామి, యాదగిరి, విజయ్‌కుమార్, ప్రదీప్, ప్రేమ్, ప్రవీణ్‌కుమార్, రఘువీర్ తదితర గురుస్వాములు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని వినతి



అంబర్‌పేట: ముదిరాజ్‌లను బీసీ-ఎ జాబితాలో చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కలిసి రాష్ట్రంలో ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సంఘం రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, సంతోష్, రాంచందర్, నవీన్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

'ఔషధం' సంపుటి అందజేత



కాచిగూడ: డాక్టర్ రవి శంకర్ ప్రజాపతి రచనలో ముద్రించి ఆవిష్కరించిన 'ఔషధం' ఓ జీవధుని కవితా చికిత్స.. కవితా సంపుటిని సోమవారం ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఉస్మానియా ఆర్‌ఎంఓ -1 డాక్టర్ శేషాద్రి, ఆర్‌ఎంఓ డాక్టర్ ఎం.డీ. రఫీ తదితరులున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ చిమ్నానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (30) ఉందానగర్ - బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన సీఎస్‌కు శుభాకాంక్షలు



ముషీరాబాద్: రాష్ట్రానికి నూతనంగా నియమితులైన చీఫ్ సెక్రటరీ శాంతాకుమారిని సోమవారం లిబర్టీలోని బూర్గుల రామకృష్ణభవన్‌లో తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ బాగయ్య, ప్రధాన కార్యదర్శి నరహరి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో తొలి మహిళా సీఎస్‌గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఆమెను కలిసి సత్కరించి ఈ సందర్భంగా అభినందించారు.

18 నుంచి సర్వసౌభాగ్య దేవి త్రయ గీతాజ్ఞాన యజ్ఞం

లింగోజిగూడ: ఈ నెల 18 నుంచి మూడ్రోజుల పాటు కర్మన్‌ఘాట్‌లోని శ్రీలక్ష్మీ కన్వెన్షన్‌లో శ్రీసర్వసౌభాగ్య దేవి త్రయ గీతాజ్ఞన యజ్ఞ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాజేశ్వరశర్మ, శ్రీనివాస్‌లు తెలిపారు. సోమవారం కర్మన్‌ఘాట్‌లో వారు మాట్లాడుతూ.. ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎంపీలు పోతుగంటి రాములు, గడ్డం రంజిత్‌రెడ్డి, ఢిల్లీ ప్రభుత్వ సలహాదారు సముద్రాల వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిలు పాల్గొంటారు.

'కంటి వెలుగు'కు ఏర్పాట్లు..!

- ఉచితంగా కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు
- 19 నుంచి 100 రోజులు కొనసాగింపు
- పండుగలు, ఆదివారం కేంద్రాలకు సెలవు



ముషీరాబాద్: అందత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు పథకం అమలుకు జీహెచ్‌ఎంసీ సర్కిల్ - 15 అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి పౌరుడికి పరీక్షలు నిర్వహించడమే లక్ష్యంగా చేపడుతున్న కంటి వెలుగు పథకాన్ని ఈనెల 19 నుంచి సర్కిల్ -15 పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో చేపట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

- ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందుల పంపిణీ, అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు చేయడం కోసం అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు.
- నియోజకవర్గంలో మొత్తం 6 మున్సిపల్ డివిజన్‌లలో 8 కంటి వెలుగు పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ నెల 19 నుంచి కంటి పరీక్షలు మొదలుపెట్టనున్నారు.
- వంద రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.
- కంటి వెలుగు పథకం అమలులో భాగంగా సెలవులు మినహా 100 రోజులపాటు కంటి వైద్య పరీక్షలు కొనసాగుతాయని సమాచారం.
- ముషీరాబాద్ నియోజకవర్గంలో దాదాపు 2లక్షల మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది.
- ప్రతి పౌరుడికి నిర్దేశించిన సమయంలోనే కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరుగుతుంది.
- క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది, ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి ఇంటి నెంబరు ఆధారంగా కూపన్‌లను పంపిణీ చేస్తారు.
- రోజుకు 60 నుంచి 100 మందికి కూపన్‌లు అందజేసి నిర్దేశిత తేదీ, సమయం ప్రకారం కూపన్‌లు తీసుకున్న వారు మాత్రమే కంటివెలుగు సెంటర్‌కు వెళ్తే అక్కడి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారు.
- నియోజకవర్గంలోని 6 డివిజన్‌లలో రోజు దాదాపు 300 నుంచి 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. వైద్య శిబిరంలో కళ్లల్లో శుక్లం, మోతియ, బిందువు, పొర, నల్లపాప మీద పొర, నరం బలహీనత వల్ల అందత్వం, నీటికాసులు, కంటిచూపులో లోపాలు, మెల్లకన్ను వంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తారు.
- శస్త్ర చికిత్స అవసరమైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేసి కంటి అద్దాలను అందజేస్తారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, వైద్యశాఖ అధికారులు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న కంటివెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. కంటివెలుగు బ్రోచర్‌ను సోమవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వైద్యశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యశ్రీ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శృతి, వీహెచ్‌ఎస్ వనిత, ఏఎన్‌ఎంలు లక్ష్మీబాయి, నాయకులు ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, రహీం, శంకర్‌గౌడ్, మహ్మద్‌అలీ, ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు.

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే నివాసంలో బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, రహీం తదితరులున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తాం..



కంటి వెలుగు పథకం అమలు కోసం 6 డివిజన్‌లలో 8 సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఎలాంటి అవాంతరాలు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తాం. రద్దీ ఎక్కువైతే మరిన్ని సెంటర్లను ఏర్పాటు చేసి అవసరమైన ప్రతి ఒక్కరిని కంటివెలుగు సెంటర్‌కు తీసుకొచ్చి పరీక్షలు నిర్వహిస్తాం. అవసరమైన వారికి మందులు పంపిణీతో పాటు ఆపరేషన్లు చేయిస్తాం. కంటివైద్య పరీక్షలు చేసుకునే వారు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది.

– ముఠా గోపాల్, ఎమ్మెల్యే ముషీరాబాద్

కంటి వెలుగు కేంద్రాలు ఇవే...

డివిజన్ పేరు	కంటి పరీక్షా కేంద్రం పేరు
1. అడిక్‌మెట్	అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్ (అడిక్‌మెట్)
2. రాంనగర్	నైబర్ హుడ్ కమ్యూనిటీహాల్ రాంనగర్
3. ముషీరాబాద్	మోహన్‌నగర్ కమ్యూనిటీహాల్
4. ముషీరాబాద్	ముషీరాబాద్ వాలిబాల్ ప్లే గ్రౌండ్
5. భోలక్‌పూర్	తాళ్లబస్తీ కమ్యూనిటీహాల్
6. భోలక్‌పూర్	మదర్సా మదినా కమ్యూనిటీహాల్
7. గాంధీనగర్	జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్
8. కవాడిగూడ	ఏవీ కాలేజ్ దోమలగూడ

వీఎస్‌టీ కార్మికుల సంక్షేమానికి కృషి



వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వీఎస్‌టీ కార్మికుల సంక్షేమానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఎస్‌టీ కంపెనీ చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా అనేక అగ్రిమెంట్లు చేయించిన ఘనత కేవలం నాయిని నర్సింహారెడ్డి గ్రూప్‌కే దక్కుతుందన్నారు.

- ఈ ఏడాది కూడా మరిన్ని అగ్రిమెంట్లతో కార్మికులకు మేలు జరిగేలా కృషి చేస్తామని ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

యూనియన్ నూతన కార్యవర్గం ..

- ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా హ్యారీ సిల్వెస్టర్, ఉపాధ్యక్షుడిగా రణదీర్‌రెడ్డి, రాములు, కోశాధికారిగా నరేందర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా రవీందర్, అసిస్టెంట్ సెక్రటరీగా వెంకట్రామిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహ్మద్, ఎండీ అతిక్‌అహ్మద్, అసిస్టెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా శంకర్‌రావు, పబ్లిసిటీ కార్యదర్శిగా మల్లేషం, అసిస్టెంట్ పబ్లిక్ సెక్రటరీగా సత్యనారాయణ తదితరులు ఎన్నికయ్యారు.

వీరభద్రస్వామి కల్యాణోత్సవానికి న్యాయవాదుల సహకారం



మాట్లాడుతున్న తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు శంకర్ తదితరులు

కాచిగూడ: ఈ నెల 22న కాచిగూడలో నిర్వహించే వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలకు న్యాయవాదులు పూర్తి స్థాయిలో సహకారాలు అందిస్తారని తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు బూరం శంకర్ అన్నారు. సోమవారం కాచిగూడలోని జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వామివారి కల్యాణ వేడుకలను విజయవంతం చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వీరభద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి వినోద్‌లు ఘనంగా సత్కరించి అభినందించారు. సేవాసమితి ప్రతినిధులు కొండూరు వినోద్‌కుమార్, దేవేందర్, ఆనంద్, హరిబాబు, సాయికిరణ్, మల్లికార్జున్, విజయ్‌కుమార్, శ్రీకాంత్, విజయ్‌కుమార్, కిషోర్ తదితరులున్నారు.

22న చేగువేరా సభను విజయవంతం చేయాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట యోధుడు చేగువేరా వారసులు డాక్టర్ అలైదాగువేరా, ప్రొఫెసర్ యెస్టేఫీనాలకు స్వాగతం పలుకుతూ ఈ నెల 22న హైదరాబాద్ రవీంద్రభారతిలో 'నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా' (ఎన్‌సీఎస్‌సీ), ఇప్సో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభను జయప్రదం చేయాలని ఇప్సో జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్, మాజీ ఎంపీ మల్లురవి పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర నాయకులు డీజీ. నరసింహరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు బాలమల్లేషం, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్, సీపీఎం నేత రమ, రాష్ట్ర నాయకులు వనం సుధాకర్, కాంగ్రెస్ నేతలు ఉమామహేష్, రాములు యాదగిరి తదితరులున్నారు.

గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా పూస నర్సింహ



నల్లకుంట: గంగపుత్ర సంఘం సర్వ సభ్య సమావేశం నల్లకుంటలోని సంఘం కార్యాలయంలో జరిగింది. ఆదివారం జరిగిన సమావేశంలో పద్మనగర్ సర్పంచ్ పోచయ్య అధ్యక్షతన సంఘం నూతన కమిటీకి ఎన్నికలు నిర్వహించగా.. అధ్యక్షుడిగా పూస నర్సింహబెస్త ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సంఘం పూర్తి స్థాయి కమిటీని నూతన అధ్యక్షుడు ప్రకటించారు.

నూతన కమిటీ వీరే..

- కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దామర శంకర్‌బెస్త, బొంది నర్సింగ్‌రావు, భాస్కర్‌బెస్త, కాపరనేనిలింగం బెస్త, ప్రధాన కార్యదర్శిగా నర్సింగ్‌రావు, కోశాధికారిగా రాజు ఎన్నికయ్యారు.

అనంతరం కమిటీ సభ్యులు కలిసి సంఘం చైర్మన్‌గా రాజబోస్, గౌరవ అధ్యక్షుడిగా పోచయ్య, ముఖ్య సలహాదారులుగా ముదారి పరశురామ్ బెస్త, కుంట ఎల్లయ్య బెస్త, దేవేందర్ బెస్తను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. గంగపుత్ర ఐక్యత, జాతి సమైక్యత కోసం గంగపుత్ర సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. గంగపుత్రుల ఆరాధ్య దైవమైన గంగామాత తెప్పోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



సన్మానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

ముషీరాబాద్: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికులుగా పనిచేయాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్‌లు హాజరై ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జమల్‌పురి నందును సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బీజేపీని ప్రజలకు మరింత చేరువచేయాలని సూచించారు. ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బద్రినారాయణ, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఆయూష్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం



చిక్కడపల్లి: ప్రొఫెసర్ శ్రీదేవి నాటి పౌరాణిక సినిమాల్లోని పాత్రలను గుర్తుచేశారని ప్రముఖులు ఆమెను ప్రశంసించారు. సోమవారం త్యాగరాయగానసభలో వీణాపాణి కళానిలయం వీనస్ జిమ్స్‌ల ఆధ్వర్యంలో 'స్వరజతులకు లయ విన్యాసం' పేరిట ఎన్‌టీఆర్ నటించిన పౌరాణిక చిత్రాల్లోని శ్రీకృష్ణుని పాత్రను ప్రొఫెసర్ శ్రీదేవి అభినయించగా.. వరలక్ష్మి గాయత్రిలు ఆమెకు తగిన సహపాత్రల్లో నటించారు. ముఖ్య అతిథిగా పోలీస్ ఉన్నతాధికారి రామదాసు తేజావత్ పాల్గొని మాట్లాడారు. దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. శ్రీదేవి , వరలక్ష్మి, గాయత్రిలు పాటకు తగినట్టుగా అభినయాన్ని ప్రదర్శించారన్నారు. విద్యావేత్త వినయలతకు సేవారత్న, గాయని మహాలక్ష్మికి సుస్వర తరంగిణి బిరుదులను అతిథులు ప్రదానం చేశారు. సంధ్యారాణి కూచిపూడి నృత్యం, రాజా, కృష్ణ, మోహన్, అరుణ, తదితరులు పాడిన పాటలు సభికులను అలరించాయి.

ఘనంగా గోదాదేవి కల్యాణం

మన్సూరాబాద్: గోదాదేవి కల్యాణం మన్సూరాబాద్ లోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం ఘ నంగా జరిగాయి. మన్సూరాబాద్ ఆదిత్యానగర్ కాలనీలో శ్రీలక్ష్మి పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, విజయశ్రీకాలనీలోని గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి.

సెంట్రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కవాడిగూడ: సెంట్రింగ్ కార్మికులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు గ్రేటర్ హైదరాబాద్ కాంట్రాక్ట్ అసోసియేషన్ (సెంట్రల్ కమిటీ) కృషి చేస్తోందని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, అధ్యక్షుడు కృష్ణ, చైర్మన్ ఎస్. పరశురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండీ చాంద్ పాషా, కోశాధికారి విష్ణువర్ధన్‌రెడ్డిలు తెలిపారు. సోమవారం అసోసియేషన్ కార్యాలయంలో సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కేలండర్, డైరీని వారు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసోసియేషన్‌ను స్థాపించిన నాటి నుంచి సెంట్రింగ్ కార్మికుల అభివృద్ధికి పాటుపడుతుందని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా కార్మికులు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రవీణ్, కరుణాకర్‌గౌడ్, మహ్మద్ అహ్మద్, మిర్జాషౌకత్‌బేగ్, నాయకులు నీలం, అర్జున్‌గౌడ్ తదితరులున్నారు.

జర్నలిజం వృత్తి కత్తిమీద సాము



చిక్కడపల్లి: జర్నలిజం వృత్తి కత్తిమీద సాము వంటిదని పొర్టీలలో పొరపాటు దొర్లకుండా తక్షణమే అందిచడం సులువు కాదని రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై జీవీఆర్ కల్చరల్ ఫౌండషన్ నిర్వహణలో మీడియా ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అంకిత భావంతో కరోనా సమయంలో పనిచేసిన జర్నలిస్టులు, వైద్యులు, పోలీసులతో సమానంగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. చిల్లరాజశేఖర్‌రెడ్డి, నరసింహారావు బొప్పానే, సామ్రాజ్యం, కాంతికృష్ణ, వెంకట్‌రెడ్డి, వెంకట్ గన్నవరపు, వార్తా విశ్లేషకులు సాయిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయం ప్రతిబింబించేలా...



కేంద్రమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

కాచిగూడ: సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకుని ఆది, సోమవారాల్లో పలు కాలనీల్లో పతంగుల పండుగ ఘనంగా జరిగింది. కాచిగూడ, గోల్నాక డివిజన్‌లలోని పలు కాలనీలు, బస్తీల్లో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. తెలుగువారి సంప్రదాయం ప్రతిబింబించేలా ప్రతికాలనీలో ఇళ్ల ఎదుట ముగ్గులతో కళకళలాండింది. డప్పు నృత్యాలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల ఆటపాటలతో కాలనీలు ఆహ్లాదకరంగా మారాయి.


- అపార్ట్‌మెంట్‌లో ఉన్నవారు కలిసికట్టుగా సంబరాలు నిర్వహించుకోగా.. చాలా కాలనీల్లో బొమ్మల కొలువులతో అలంకరించారు. ఆలయాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.
- పలు ప్రాంతాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి నిర్వహకులు బహుమతులను ప్రదానం చేశారు.
- రాష్ట్ర మంత్రులను, వివిధ రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, కార్యకర్తలు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఆయా వేడుకల్లో కాచిగూడ కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్, గోల్నాక కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నేతలు నందకిషోర్‌గౌడ్, వినోద్‌యాదవ్, సూర్యప్రకాష్‌సింగ్, టీఆర్‌ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, రాంబాబు, డాక్టర్ బద్దుల ఓంప్రకాష్‌యాదవ్, దాత్రిక్‌నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్, బి.కృష్ణాగౌడ్, అనిల్‌యాదవ్ తదితరులున్నారు.

అమ్మను స్మరించుకోవడం మానవ ధర్మం




చిక్కడపల్లి: అమ్మను స్మరించుకోవడం మానవ ధర్మమని ఆమె ఉన్నా లేకున్నా కుటుంబసభ్యులంతా కలిసి తన జన్మదినాన్ని నిర్వహించుకోవటం ఉత్తమ సంప్రదాయమని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. సోమవారం త్యాగరాయగానసభలోని కళాలలిత వేదికపై 'రక్ష ఇంటర్నేషనల్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో గానసభ సౌజన్యంతో అమ్మకు అభివందనం పేరిట సంస్థ అధ్యక్షులు రామలక్ష్మి మాతృమూర్తి ఊటుకూరి రత్నసుందరి స్మారక పురస్కారాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఆచార్య అనంత లక్ష్మికి ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా వంశీరామరాజు పాల్గొని మాట్లాడారు. అనంతలక్ష్మి తమ ప్రసంగంలో అమ్మ ప్రాధాన్యతను వివరించారు. రామలక్ష్మి తన తల్లి రత్నసుందరి ప్రేమతత్వం సేవాభావం గురించి తెలిపారు. ప్రొఫెసర్ మాధవపెద్ది కాళిదాసు, పసుమర్తి ఉమాశంకర్‌రావు తదితరులున్నారు.

ముగిసిన మల్లన్న బ్రహ్మోత్సవాలు



కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ దంపతులు



ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్‌లోని బాకారంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి (మల్లన్న) దేవాలయంలో మూడు రోజుల పాటు జరిగిన మల్లన్న జాతర మహోత్సవాలు ముగిశాయి. ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు అంజిరెడ్డి, ఊర్మిలాఅంజిరెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి జ్యోతి ఆధ్వర్యంలో ఆలయ పూజారి మధుసూదన్‌చారి, ఒగ్గు పూజారులు సీతారామశర్మ, బాబూయాదవ్‌ల సమక్షంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య ముగిశాయి. ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ వి. హనుమంత్‌రావు, కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్‌లు, వివిధ పార్టీల నాయకులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ముషీరాబాద్: శాంతి భారత్ సేవా సమాజ్ నేతలు ఈదమ్మ, పోచమ్మ దేవాలయం నుంచి సంప్రదాయ రీతిలో పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పించారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ కార్పొరేటర్లు వాజీద్ హుస్సేన్, కల్పనాయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహా, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి కనకేష్ కుమార్ తదితరులు హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అంజిరెడ్డి, దేవాదాయశాఖ ఈఓ జ్యోతిలు శాలువాతో సన్మానించారు.

చిక్కడపల్లి: ముషీరాబాద్ నియోజవర్గం బాకారం మల్లన్న దేవాలయంలో ప్రతి ఏటా నిర్వహించే మల్లన్న జాతర, స్వామి వారి కల్యాణం తదితర పూజా కార్యక్రమాల్లో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ సోమవారం పాల్గొన్నారు. బీజేపీ నగర యువనేత వినయ్‌కుమార్ నాయకులు వీఎస్టీ రాజు, ఆనంద్‌రావు దర్శించుకున్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383